# నారింజా సమ్మర్ స్కూల్

## ఇల్లేరమ్మ కతలు



నాది ఫోర్త్ ఫారం పరీక్షలు కూడా అయిపోయాయి.

సెలవులయ్యాక ఫిఫ్తు ఫారంలో చేరడమే. అంటే ఒక్కసారి కూడా ఫస్టు రాకుండానే స్కూలు చదువంతా అయిపోతోంది. నిరుడంటే సెలవల్లో చచ్చేలా పని చెయ్యడం నేర్చుకున్నాం. ఇప్పుడయితే పెద్దయి పోతున్నాం కదా! ఇంకా చిన్నచిన్న పనులు నేర్చుకుంటున్నావంటే ఎవరన్నా నవ్వుతారు కూడా! అమ్మక్కూడా నా మీద ఎంత నమ్మకం వచ్చేసిందంటే సాయంత్రాలు కూర మాడకుండా కలపడం, పచ్చడి నూరడం లాంటివి నాకే వదిలేస్తోంది. చిన్నారికేమో కంచాలు పెట్టడం, వంటిల్లు కడగడం, ఇందూకీ బుజ్జీకి పొద్దున్నే పక్కలెత్తడం దుప్పట్లు మడత పెట్టడం లాంటి చిన్నచిన్న డ్యూటీలు. నే వాళ్లంతున్నప్పుడు నా చేత ఎంత పెద్ద పనులు చేయించేదో!

ఎవరయినా ఇంటికి పెద్ద ఆడపిల్లగా పుట్టకూడదు బాబూ ఒకటే పన్లు అని నేననుకుంటుంటే విని ఏవందో తెల్సా ''నీకేవే! వున్నవీ మన్నవీ పెట్టి పెద్ద పిల్లవని బాగానే సాగనంపుతాం. ఎవరూ కూడా చివరాడపిల్లగా పుట్టకూడదు. పెద్ద కోడలిగా మెట్ట కూడదూ!'' అని ఎదురు నాకే పెద్ద పాఠం చదివింది. సర్లే ఇప్పట్నించీ మళ్లీ జన్మలో ఎలా పుట్టకూడదో ఆలోచించుకోడం దేనికని అప్పటి కూరుకున్నాను.

మళ్లీ సీజను మొదలైందికదా - ఇంక రెండు మూడ్నెల్ల వరకూ నాన్న కంటపడనే పడరు. అందులో ఇది ఆఖరి సంవత్సరం. ఇంకో అయిదారు నెలల్లో రోడ్డు బ్రిడ్జి తెరిచేస్తారట. ఇంట్లో కూచుని కూచుని విసిగెత్తి పోతుందేమో! ఎంత సేపని వేళ్ళు వాచేలా చింతగింజలాడతాం! గొంతరిగి పోయేలా పాటలు పాడతాం! ఏదో ఒకటి అనువైన పని ఎంచుకోబోతే ఈ సెలవల్లోంచి ప్రాణాలతో బయట పడలేవేమోనని భయం పట్టుకుంది.

ఏవీ తోచక నేనూ చిన్నారీ నారింజ చెట్టు కిందకి చేరాం. అప్పటికే భాగ్యమ్మా వాళ్లూ అక్కడ కూచున్నారు. చెట్టు మీదన్నీ నారింజ పళ్లే. అన్నీ మావిడి పండు రంగులోకి మారిపోతున్నాయి. వూరంతా ఎంత ఎండగా ఉన్నా ఆ చెట్టుకింద మాత్రం చల్లగా వుంటుంది. గచ్చుకూడా వేడెక్కదేవిటో. ఒక్కోళ్లం ఒక్కో కొమ్మా నాదనుకుని లెఖ్ఖ పెడితే అయిదు వందల కాయలు తేలాయి.

చిన్నారంది ''సుశీలా! స్కూలు కెళ్లకుండా ఇంట్లో వుండాలంటే నావల్ల కావట్లేదు. మనం ఈ చెట్టుకిందే కూచుని స్కూలు కొచ్చాం అనుకుని ఒకళ్ల కొచ్చినవి ఇంకోళ్లకి నేర్పుదాం. మనం అందరం కలిస్తే ఏడుగురం వున్నాం కదా!.''

''ఛీ! ఏం బాగుంటుంది. ఈ బుజ్జికేం వచ్చు ఏడవడం తప్ప. ఇంత బతుకూ బతికి దీని దగ్గిరేం నేర్చుకుంటానూ! పోనీ పంకజవన్నా అయితే పాటలు నేర్చుకోవచ్చు'' అని దానిమాట తీసి పారేశాను.

అప్పుడు భాగ్యం ''కాదోయ్! చిన్నారి చెప్పింది పాపం బాగానే వుంది. కాకపోతే ఇంకోలా చేద్దాం. స్కూలంటే రాజ భవనంలో పెట్టక్కర్లేదు కదా. ఈ నారింజ చెట్టుకిందే స్కూలు పెడదాం. మనందరం టీచర్లుగా ఉందాం. వీధిలో తిరిగి కాస్తమంది పిల్లల్ని పోగేస్తే ఈ రెండు నెలలూ స్కూలు నడుపుకోవచ్చు. బుజ్జిని కూడా స్టూడెంట్‌గా తీసుకుంటే సరి'' అని అంది.

''అవుననుకో! మనకి లెఖ్ఖలవీ బాగా వచ్చని మనకి తెలుసుగానీ తప్పులు చెప్తావని అమ్మలు భయపడతారేమో కదా! సెలవుల్లో భూగోళం విజ్ఞాన శాస్త్రం నేర్పుతావంటే పిల్లలకి ఏం నచ్చుతుందీ'' అన్నా. అయినా పన్నెండు నుంచీ నాలుగు వరకూ పిల్లల్నాడించి పెడతావంటే ఏ అమ్మలు ఒప్పుకోరూ? హాయిగా వాళ్లని తోలేసి నిద్దరోవచ్చునని అనుకుంటారు కదా. సాయంత్రం అమ్మా అత్తయ్యగారూ పెరట్లో కొచ్చే వరకూ మేం అలా మాట్లాడుకుంటూనే వున్నాం స్కూలాట ఎలా ఆడుకోవచ్చా అని.

మా స్కూలు పేరు ''నారింజా సమ్మర్ స్కూల్.'' నేను ప్రిన్స్‌పాల్‌ని. చిన్నారి భాగ్యమ్మ హెడ్‌మిస్ట్రసులు ఓ రోజొకళ్లు, మర్నాడొకళ్లు లాగా. ఇంక మిగతా వాళ్లంతా టీచర్లు. బుజ్జి స్కూలు లీడరు. మూడేళ్ల నించీ ఎన్నేళ్ల వాళ్లనయినా చేర్చుకుంటాం. రెండు రూపాయలు ఫీజు. పన్నెండుకల్లా అమ్మలు దిగబెట్టాలి. నాలుగింటికి [illegible]కెళ్లాలి. ఇదీ మేం నిర్ణయించుకున్నది.